# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  01-11-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశంలోని ప్రతి ప్రాంతం మావోయిస్టు హింస నుండి విముక్తి పొందే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 14 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.

❖ అన్ని ప్రాంతాల భద్రత, సమగ్ర పురోగతి స్ఫూర్తితో నిర్మాణాత్మక సహకారాన్ని అందించడానికి భారత్ కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

❖ హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియా జాయ్ - 2025 సమావేశంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు వేవ్స్ బజార్‌ను ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌తో సహా దేశంలోని ప్రతి ప్రాంతం మావోయిస్టు హింస నుండి విముక్తి పొందే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాయ్‌పూర్‌లో ఈరోజు జరిగిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రజతోత్సవ వేడుకలను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... మావోయిస్టు ఉగ్రవాదం కారణంగా ఛత్తీస్‌గఢ్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి ప్రాథమిక సౌకర్యాలను కోల్పోయాయని తెలిపారు. ఇటీవలి కాలంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి, జన జీవన స్రవంతిలో చేరి, భారత రాజ్యాంగాన్ని అంగీకరించారని చెప్పారు. నక్సలిజం ముప్పు నుండి దేశాన్ని విముక్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 14 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ఛత్తీస్‌గఢ్ శాసనసభ నూతన భవనాన్ని ప్రారంభించీ, భవన ప్రాంగణంలో పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నయా రాయ్‌పూర్‌లో బ్రహ్మా కుమారీల శాంతి శిఖరాన్ని ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ "దిల్ కి బాత్" కార్యక్రమం కింద దాదాపు రెండున్నర వేల మంది పిల్లలతో ప్రధానమంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ప్రధాని మాట్లాడుతూ... భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశ అభివృద్ధి రాష్ట్రాల అభివృద్ధితో ముడిపడి ఉందని నరేంద్ర మోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో ప్రసార భారతి రేపటి నుండి ఈ నెల 29వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 24 కేంద్రాలలో 67వ ఆకాశవాణి సంగీత సమ్మేళనాన్ని నిర్వహించనుంది. 1954లో ప్రారంభమైనప్పటి నుండి ఆకాశవాణి సంగీత సమ్మేళనం భారతదేశంలో అత్యంత శాశ్వతమైన, గౌరవప్రదమైన సాంస్కృతిక సాంప్రదాయాలలో ఒకటిగా నిలిచిందని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు హిందుస్తానీ, కర్ణాటక, జానపద సంగీతాల అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. COVID-19 మహమ్మారి కారణంగా స్వల్ప అంతరాయం తర్వాత, ఈ ఉత్సవం ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో తిరిగి ప్రారంభమవుతుందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ఢిల్లీ వెలుపల BS-3, అంతకంటే తక్కువ కేటగిరీల కింద నమోదు చేసుకున్న అన్ని వాణిజ్య వాహనాలను ఈ రోజు నుండి దేశ రాజధానిలోకి ప్రవేశించకుండా నిషేధించారు. BS-4 కేటగిరీకి చెందిన వాణిజ్య వస్తువుల వాహనాలను వచ్చే ఏడాది అక్టోబర్ 31 వరకు ఢిల్లీలోకి ప్రవేశించడానికి అనుమతి ఉంది. అయితే, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ సిఫార్సు మేరకు ఢిల్లీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో నమోదు చేసుకున్న వాణిజ్య వస్తువుల వాహనంపై ఎటువంటి పరిమితి లేదని కమిషన్ తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు జరిగిన విషాద సంఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తన సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు  2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం  అందజేస్తామని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భద్రత, వృద్ధి, స్థిరత్వాల మధ్య బలమైన సంబంధం... భారతదేశ, ఆసియా కూటమి దేశాల భాగస్వామ్యం యొక్క నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ రోజు జరిగిన 12వ ఆసియా కూటమి దేశాల రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. ఈ సమావేశం

భారతదేశం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ, అందులో ఇండో-పసిఫిక్ దార్శనికతలో అంతర్భాగమని అన్నారు. అన్ని ప్రాంతాల భద్రత, వృద్ధి, పరస్పర, సమగ్ర పురోగతి (మహాసాగర్) స్ఫూర్తితో నిర్మాణాత్మక సహకారాలను అందించడానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. భారతదేశ విధానం ఎల్లప్పుడూ స్పష్టంగా ఉందని రాజనాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియా జాయ్ - 2025 సమావేశంలో ఈ రోజు కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని వేవ్స్ బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వేవ్స్ బజార్ మాధ్యమం వినోద పరిశ్రమ మొత్తానికి ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఇది నైపుణ్యాన్ని వాణిజ్యంగా మారుస్తుందని, అమ్మకం దారులు, కొనుగోలుదారులను ఒకే వేదిక పైకి  తీసుకువస్తుందని పేర్కొన్నారు. OTT కొనుగోలుదారులు కూడా వేవ్స్ బజార్ వేదిక ద్వారా అన్ని భాషలలో తగిన మార్కెట్‌ను, అవకాశాలను చేజిక్కించుకుంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని ఉడాన్ భవన్‌లో పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉద్యోగుల పిల్లల పగటి పూట సంరక్షణ కేంద్రాన్ని ఈ రోజు ప్రారంభించారు. ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తూ... కార్యాలయంలో వారికి అనుకూలమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ఈ కేంద్రం ఒక ముందడుగు అని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లల సాధారణ సంరక్షణ కోసం దీనిని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పోషకాహారం, ఆటలు, ప్రీ-స్కూల్ అభ్యాసం, వైద్య సంరక్షణ సౌకర్యాలు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకున్నారు. బీచ్ రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. రంగసామి జాతీయ జెండాను ఎగురవేసి, పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గడంతో పుదుచ్చేరి ప్రసూతి మరణ రహిత రాష్ట్రంగా అవతరించిందన్నారు. పుదుచ్చేరి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించేందుకు కారైకల్‌లో కొత్త స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. నవంబర్ 1, 1954లో దాదాపు 300 సంవత్సరాల ఫ్రెంచ్ పాలన నుండి పుదుచ్చేరి విముక్తి పొందింది. పుదుచ్చేరిని భారత దేశంలో విలీనం చేయడానికి పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైస్ అడ్మిరల్ బి. శివకుమార్ ఈరోజు 40వ చీఫ్ ఆఫ్ మెటీరియల్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకలు, భారత నావికాదళ నౌకలు రంజిత్, కిర్పాన్, అక్షయ్‌లలో సేవలందించారని, ప్రీమియర్ ఎలక్ట్రికల్ ట్రెనింగ్ బేస్, INS వల్సురాకు కమాండ్‌గా పనిచేశారని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =